క్లుప్తంగా

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు



తాడేపల్లిరూరల్ : తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన డి.సీతారామయ్యను శుక్రవారం ఆయన కార్యాలయంలో తాడేపల్లి మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ సతీష్, తాడేపల్లి మండల ఆర్ఐ వంశీ, డీలర్లు భోగాల బ్రహ్మానందరావు, వక్కలగడ్డ సాంబశివరావు కుమారుడు చంద్రశేఖర్, గోలి ఆంథోని కుమారుడు విజయ్, కడియం దుర్గా వరప్రసాదరావు, మూర్తి, సుందరరావు, దొంత బాలాజీ, దొంతిరెడ్డి బసిరెడ్డి, శ్యామ్, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో చవితి పందిళ్లలోని వినాయక విగ్రహాలకు ఆరో రోజు శుక్రవారం విశేషపూజలు చేశారు. రేపూడిలోని కోదండరామాలయం వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర విగ్రహానికి అర్చకులు దివి కృష్ణమూర్తి అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



ఫిరంగిపురం: నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నిర్మలాలక్ష్మీకుమారి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పాఠశాలల హెచ్ఎంలు, ఆరోగ్య సిబ్బందికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈనెల 17న నిర్వహించే జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లల చేత మాత్రలు మింగించాలని సూచించారు. అనంతరం హెచ్ఎంలకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతతో సమస్యలు



తాడికొండ: బాలికల్లో రక్తహీనత అనేక సమస్యలు సృష్టిస్తుందని తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏవీ వరప్రసాద్ అన్నారు. ఎస్‌వీవీ హైస్కూల్ చిన్నారులకు రక్తహీనత-దుష్పరిణామాలు నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో రక్తహీనత నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ షాపులో అగ్నిప్రమాదం



తాడేపల్లిరూరల్: స్థానిక వినుకొండ అంకమ్మ గుడి సమీపంలో బైక్ మెకానిక్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల శుక్రవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బైక్ మెకానిక్ షాపు దగ్గర ఉన్న యువకులు, షాపు యజమాని మంటల్లో కాలిపోతున్న ద్విచక్ర వాహనాలను బయటకు తీసి మంటలను అదుపు చేసేందుకు ఇసుక, నీటిని చల్లారు. షాపులో నేలమీద ఆయిల్ ఉండడంతో భారీగా మంటలు చెలరేగాయని, అందువల్లే కొన్ని ద్విచక్ర వాహనాలకూ మంటలు అంటుకుని దట్టంగా పొగలు వ్యాపించాయని, వాహనాల సీట్లు మాత్రం స్వల్పంగా దగ్ధమయ్యాయని వివరించారు. మంటలను సకాలంలో అదుపు చేయకుంటే పెనుప్రమాదమే జరిగేదని స్థానికులు చెబుతున్నారు.

• 'ఛిద్ర'వద



రాళ్ళు మొనదేలి అధ్వానంగా ఉన్న తాడికొండ- నిడమర్రు రోడ్డు



లో లెవల్ చప్టాపై నిలిచిన నీరు

తాడికొండ- నిడమర్రు ప్రధాన రహదారి మరమ్మతుల్లేక ఛిద్రమైంది. ఫలితంగా ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం తారురోడ్డు వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. పెద్ద వాగు కట్టపై అరకిలో మీటరు మేర భూసేకరణ చేసి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టినా, రైతులు భూములు ఇవ్వడానికి ససేమిరా అనడంతో కాంట్రాక్టర్ అరకొరగా నిర్మించి పత్తా లేకుండా పోయారు. మార్గమధ్యంలో మూడు లో లెవల్ చప్టాలపై వంతెనలు నిర్మించాల్సి ఉన్నా.. నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం రోడ్డు తీవ్రంగా ఛిద్రమైంది. ద్విచక్రవాహనాలపైనా వెళ్లలేని దుస్థితి నెలకొంది. చినుకుపడితే లో లెవల్ చప్టాలపై భారీగా నీరు చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు కనీసం మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

– తాడికొండ

• సేవలకు మంగళంపాడినట్టేనా!



ఇది గత ప్రభుత్వం పశువైద్యసేవలు అందించాలనే సదుద్దేశంతో సమకూర్చిన సంచార పశు ఆరోగ్య సేవ వాహనం. ఈ వాహనం వారం రోజులుగా మూలన పడి ఉంది. ఫలితంగా జీవాలకు వైద్యసేవలు అందక పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులకు దీనిపై ఫిర్యాదు చేసినా స్పందన లేదు.

– తాడికొండ

టీడీపీ మహిళా విభాగం మండల కార్యదర్శిపై దాడి

పోలీసులను ఆశ్రయించిన టీడీపీలోని రెండువర్గాలు



పోలీస్‌స్టేషన్ దగ్గర కుమారుడితో కలిసి మాట్లాడుతున్న నెమలికంటి అనూష

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పెనుమాకలో టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య విభేదాలు రావడంతో ఒకరిపై ఒకరు దాడిచేసుకుని ఆలస్యంగా శుక్రవారం తాడేపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఇరు వర్గాల వారూ టీడీపీనే కావడంతో కేసు నమోదు చేయడంలో పోలీసులు అలసత్వం వహించారు. టీడీపీ మహిళా విభాగం తాడేపల్లి మండల కార్యదర్శి అనూష కథనం ప్రకారం.. అనూష భర్త నెమలికంటి వీరాంజనేయులు, ఆయన బాబాయి కోటేశ్వరరావు కోళ్ల పంపకం విషయంలో పరస్పరం తిట్టుకున్నారు. అదే ప్రాంతంలో ఉంటున్న కోట పృథ్వి తననే తిడుతున్నారని వీరాంజనేయులుపై బుధవారం దాడి చేశాడు. ఈ నేపథ్యంలోనే శకుంతల అనే మహిళ అనూషకు ఫోన్ చేసి బూతులు తిట్టింది. అనంతరం ఫోన్ కట్ చేసి అనూష ఇంటికి వచ్చి ఆమెపైనా, ఆమె భర్తపైనా దాడి చేశారు. ఆ తర్వాత అనూష, ఆమె భర్త ఆస్పత్రికి వెళ్లగా, అప్పుడు ఇంటి వద్ద ఉన్న వారి చిన్న కొడుకుపై దాడికి పాల్పడ్డారు. పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోకపోవడంతో అనూష పోలీసులను ఆశ్రయించారు. అయినా పోలీసులు అనూష భర్తనే స్టేషన్‌లో కూర్చోబెట్టారు. దీంతో అనూష ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మహిళా విభాగం కార్యదర్శిగా ఉన్న తనపైనే పార్టీలోని కొంత మంది దాడికి పాల్పడితే నాయకులు పట్టించుకోవడం లేదని విలపించారు. ఇదిలా ఉండగా కోట పృథ్వి కూడా పోలీసులను ఆశ్రయించారు. అనూష, ఆమె భర్త తనపై దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉండవల్లి సెంటర్, కుంచనపల్లి, మెల్లెంపూడి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, కుంచనపల్లి పరిధిలోని మదర్ థెరిస్సా కాలనీకి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

తాడికొండ: వరద బాధితుల సహాయార్థం శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో తాడికొండలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పలు వ్యాపార సంస్థలు, దుకాణాల నిర్వాహకులు, గ్రామస్తులు తమకు తోచిన ఆర్థిక సాయం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

నిర్మాణంలో ఉన్న ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చోరీ

రూ.1.50లక్షల విలువైన సామగ్రి అపహరణ

తాడికొండ: నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్, ఓల్డ్ ఏజ్ హోమ్‌లో రూ.1.50 లక్షల విలువైన సామగ్రి చోరీ జరిగిన ఘటన తాడికొండ మండలం మోతడక గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మోతడకలో నిర్మాణంలో ఉన్న కాకతీయ కన్వెన్షన్ సొసైటీ, ఓల్డ్ ఏజ్ హోమ్‌లో రూ.1.50 లక్షల విలువైన ప్లంబింగ్, విద్యుత్ సామగ్రిని గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. గురువారం వర్కర్లు పనిచేసి బయటకు వెళ్లిన తర్వాత రాత్రి కాపలాదారులు నిద్రిస్తుండగా చోరీ జరిగినట్లు తెలుస్తోంది. దీనిపై గింజుపల్లి శ్రీనాథ్ చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వాసు తెలిపారు.

బస్‌బే నిర్మాణం నిలుపుదల

నెహ్రూనగర్: గుంటూరు గాంధీపార్కు వద్ద కడుతున్న బస్‌బే నిర్మాణాన్ని పట్టణ ప్రణాళిక అధికారులు శుక్రవారం నిలుపుదల చేశారు. నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఉండే గాంధీపార్కు వద్ద పరదలు కట్టుకుని గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రి శ్లాబ్ వేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్ రంగంలోకి దిగారు. దీనిపై విమర్శలు రావడంతో అధికారులు అక్కడ సెంట్రింగ్ చెక్కలను తొలగించారు. ఇది తాత్కాలికంగా ఆగుతుందో లేక.. మళ్లీ నిర్మాణానికి బీజం పడుతుందో వేచి చూడాలి.

అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు



అధికారులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని గుంటూరు నగరంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో గుంటూరు నగరంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమ అమలుపై విభాగాధిపతులు, ఇతర అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో విజయవంతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కలిగించడం, ప్రోత్సహించడం జరుగుతుందని చెప్పారు. వార్డు సచివాలయాల వారీగా సామూహిక పరిశుభ్రత డ్రైవ్‌లను నిర్వహించాలని కోరారు. కార్యక్రమాల వారీగా జీఎంసీ అధికారులకు, నోడల్ అధికారులుకు విధులు కేటాయించాలన్నారు. నగరంలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరాల నిర్వహణ చేపట్టడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో ఎస్ఈ ఎం.శ్యాం సుందర్, సిటీ ప్లానర్ డి.రాంబాబు, ఎంహెచ్ఓ మధుసూదన్, తూర్పు ఎంహెచ్ఓ(ఇన్‌చార్జి) రామారావు, మేనేజర్ ప్రసాద్, ఏడీహెచ్ రామారావు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



ఎల్ఈడీ టీవీని అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

నగరంపాలెం: విద్య, వైద్య రంగంలో 'మానవత' సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్రాడీపేట 2/13లోని శ్రీ శారదాని కేతన్ విద్యా సంస్థకు శుక్రవారం డిజిటల్ తరగతుల సౌకర్యార్థం ఎల్ఈడీ టీవీని అందజేశారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ సంస్థ పక్షాన విద్య, వైద్య రంగాల్లో సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడం ప్రశంసనీయమని అన్నారు. ఇటువంటి సంస్థలు సమాజానికి చాలా అవసరమని పేర్కొన్నారు. సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు రాణించాలని అన్నారు. కష్టపడి చదివితే భవిష్యత్ బంగారు బాట అవుతుందని చెప్పారు. చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ సంస్థ నుంచి సమాజానికి మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు. టీవీ దాత అయిన వోలు బ్రహ్మయ్య, సుందరరామయ్య, సాయికిరణ్, గురువారెడ్డి, సుబ్రహ్మణ్యం ధనుంజయరెడ్డి, శివాజీ సాంబశివరావు, ఈట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెనాలిలో వైభవంగా హిందీ దినోత్సవం

తెనాలి: పట్టణ మారిస్ పేట లోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూలులో శుక్రవారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా శాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన వేడుకలకు హిందీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనిమిరెడ్డి విజయకుమార్ అధ్యక్షత వహించారు. 1949 సెప్టెంబర్ 14వ తేదీన హిందీ భాషను అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి హిందీ దివస్ వేడుకలను దేశమంతటా జరుపుకుంటున్నట్టు ఆయన గుర్తుచేశారు. హిందీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, హైస్కూలు హిందీ ఉపాధ్యాయుడు పులి భాస్కర్ మాట్లాడుతూ సంస్కృతం నుంచి గ్రహించిన, హిందీ భాష క్రమంగా విద్యార్థులందరికీ చక్కగా అర్థమయ్యేలా సులభతరం చేశారని చెప్పారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో హిందీ ముఖ్య భాషగా ఉందన్నారు. ప్రముఖ హిందీ గురువు జీవీఎస్ వరదాచార్యులను వేదికపై ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత జీవీఎస్ వరదాచార్యులు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే భాషల్లో హిందీ రెండవ భాషని, 'లాంగ్వేజ్ ఆఫ్ యూనిటీ'గా మహాత్మా గాంధీ అన్నారని గుర్తుచేశారు. హిందీ నేర్చుకుంటే దేశంలో ఎక్కడికి వెళ్లినా భాష సమస్య లేకుండా జీవించవచ్చని తెలిపారు.విద్యార్థులందరూ హిందీ చక్కగా నేర్చుకోవాలని సూచించారు. తెనాలి పట్టణంలోని గల హైస్కూళ్లలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులనూ ఇదే వేదికపై ఘనంగా సత్కరించారు. హిందీలో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రం , జ్ఞాపికను బహూకరించారు. కేరళలోని వయనాడు బాధితులకు వితరణ అందించిన విద్యార్థులకూ జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. హిందీ ఉపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు తాటి నరేష్, ప్రధానోపాధ్యాయిని పీ వీ సుధారాణి బాపట్ల జిల్లా హిందీ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి వీసీహెచ్ శివకుమార్, లలిత అండ్ కో కుమార్, బి.విజయకుమారి, జ్యోతిరావు హిందీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

వినాయకుని పూజల్లో తులసి ధర్మచరణ్

కొరిటిపాడు: అన్నదానం చేయడం మహా పుణ్యకార్యమని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. స్థానిక గుజ్జనగుండ్లలోని ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో గణపతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మహా నైవేద్యం సమర్పించి, వేద పండితుల నుంచి ఆశీర్వచనం స్వీకరించిన అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని అన్నారు. తొలి ఏడాది శ్రీ గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏడు వేల మందికి అన్నదానం చేయడం మంచి విషయంగా చెప్పారు.

పోరాట యోధుడు ఏచూరి



తాడేపల్లిలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వామపక్షాల నాయకులు



పొనుగుపాడులో సీతారాం చిత్రపటం వద్ద నివాళి

తాడేపల్లిరూరల్/తాడికొండ/ఫిరంగిపురం : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పోరాట యోధుడని ఆ పార్టీ నేతలు పలువురు కొనియాడారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేబీ భవన్‌లో సీతారాం ఏచూరి సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు, రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, తాడేపల్లి మండల నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య పాల్గొని సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏచూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు బూరగ వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, జెట్టి బాలరాజు, దశరథ రెడ్డి, వీరాస్వామి, విజయ్‌బాబు, ఎస్‌కె. గన్, బి. కోటేశ్వరి, ఫకీరయ్య, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాడికొండలో..

సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను శుక్రవారం తాడికొండ బస్టాండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి వామపక్షాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏచూరి జీవితం ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, ఏరియా కార్యదర్శి దేవునిదయ, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు గుర్రంకొండ సత్యానందం, కనగాల పూర్ణచంద్రరావు, ఇమ్మడి రామారావు, జోజి బాణావత్ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో సీతారాం చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ ఫిరంగిపురం మండల కార్యదర్శి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

అధునాతన టెంట్లతో సినిమా ప్రదర్శన

తెనాలి: అధునాతన టెక్నాలజీతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో తాత్కాలిక టెంట్లలో పెద్ద స్క్రీన్‌తో సినిమాలను ప్రదర్శిస్తుండటం ఆహ్వానించదగ్గ పరిణామంగా ఏపీ-మా వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇందుకు అవకాశం కల్పిస్తే, చిన్న సినిమాలన్నీ విడుదలకు నోచుకుంటాయని, ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపాలని కోరారు.

స్థానిక మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో శుక్రవారం కార్య నిర్వాహక సభ్యుల సమావేశం నిర్వహించారు. తమ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. తాత్కాలిక టెంట్లతో కేవలం రూ.50 టికెట్‌పై అన్ని మేజర్ పంచాయతీల్లోనూ సినిమాను ప్రదర్శించవచ్చనీ తెలిపారు. వినోదపన్ను మినహాయింపుతో సహా కొన్ని రాయితీలకు ప్రభుత్వం చొరవ చూపితే, సినిమా ప్రదర్శనలో కొత్త శకం ఆరంభం కాగలదన్నారు. థియేటర్లు దొరక్క, వదలకొద్దీ చిన్న సినిమాలు విడుదలకు నోచుకోలేదని గుర్తుచేశారు. ఒక నెలలో పెద్ద సినిమాలకు మూడు వారాలు, మరో వారం చిన్న సినిమాల విడుదలకు అవకాశం కల్పించేలా చేసినా బాగుంటుందన్నారు సమావేశంలో నటులు మిలటరీ ప్రసాద్, అమీర్ చౌదరి, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

• మాయ'దారి మలుపులు'



రోడ్డు పక్కన పెరిగిన పిచ్చిమొక్కలు



రేపూడి గ్రామ శివారులోని మూలమలుపు

ఫిరంగిపురం మండలంలో పలు మలుపులు ప్రమాదకరంగా మారాయి. అమీనాబాద్ గ్రామ శివారు నుంచి జోసిల్ కంపెనీ వరకు మధ్యలో ఉన్న మలుపులతోపాటు వేములూరిపాడు మల్కాచెరువు, జలపాలేశ్వరస్వామి ఆలయం, సాగర్ కెనాల్ కాలువ, రేపూడి గ్రామ శివారు, నుదురుపాడు గ్రామశివారు, రైల్వే అండర్ బ్రిడ్జి, మేరికపూడి గ్రామశివారు, పొనుగుపాడు రోడ్డు సమీపంలో ఉన్న మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు గందరగోళానికి గురై ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రతినెలా ఈ మలుపుల వద్ద ఆరు నుంచి ఏడు వరకు ప్రమాదాలు జరుగుతున్నట్టు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఈ దారికి ఇరువైపులా గతంలో మట్టి రోడ్డు ఉండేది. అయితే ఆ రోడ్డుపై నాలుగడుగుల ఎత్తులో పిచ్చి మొక్కలు, గడ్డి మొలిచింది. ఫలితంగా తారురోడ్డు దిగి మట్టి రోడ్డులోకి వెళ్లేందుకూ ఆస్కారం లేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– ఫిరంగిపురం

ఎస్సీ రిజర్వేషన్లపై తీర్పును నిలుపుదల చేయాలి

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

తెనాలి: ఎస్సీ రిజర్వేషన్లను రాష్ట్రాలు కులాలవారీగా వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పార్లమెంటు జోక్యం చేసుకుని నిలుపుదల చేయాలని కోరుతూ తెనాలి డివిజన్ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఎటువంటి వర్గీకరణ చర్యలు చేపట్టవద్దని సమితి నాయకులు కోరారు. ఆ ప్రకారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహకు అందజేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమనీ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ మాల కులంతోపాటు అన్ని ఎస్సీ కులాలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. కొన్ని దళిత వ్యతిరేక రాజకీయ పార్టీలు దళితుల మధ్య విభేదాల కల్పనకు పన్నిన కుట్రలో భాగమే ఇదనీ, దీనివల్ల ఓటు బ్యాంకు రాజకీయాలను ప్రోత్సహించినట్టు కాగలదని పేర్కొన్నారు. న్యాయవాదులు కంచర్ల కోటేశ్వరరావు, పిల్లి ప్రేమరాజ్, గుమ్మడి రవిరాజు, బహుజన సమాజ్ పార్టీ తెనాలి ఇన్‌చార్జి కారుమంచి సునీల్ సందీప్, మాల మహానాడు గుంటూరు జిల్లా అధ్యక్షుడు బొనిగల ప్రవీణ్, హైకోర్టు న్యాయవాది చైతన్య పాల్గొన్నారు.